గంజాయి నివారణకు పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- జగ్గంపేటలో రూ.30.5 లక్షల విలువైన 492 కేజీల గంజాయి పట్టివేత
- 8మంది అరెస్టు, 7 సెల్‌ఫోన్లు, రూ.2.75 లక్షల నగదు, కారు స్వాధీనం
- నిందితులపై ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్


స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు, వాహనం, నిందితులతో ఎస్పీ బిందుమాధవ్, పోలీసులు

జగ్గంపేట: గంజాయి రవాణా, విక్రయాల నివారణకు జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నిందితులపై ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ చేస్తామని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. జగ్గంపేట పోలీసు సర్కిల్ కార్యాలయంలో 492 కేజీలు గంజాయిని పట్టుకున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము పట్టుకున్న గంజాయి విలువ రూ.30.5 లక్షలు ఉంటుందని, గంజాయి ముఠా నుంచి ఒక వాహనం, 7 సెల్‌ఫోన్లు, రూ.2.75 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయిని ఒక ముఠా ఏజెన్సీలో కొనుగోలు చేసి దాన్ని జగ్గంపేటలో స్థానికంగా నిల్వ చేసిందని చెప్పారు. దీన్ని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేయడానికి ప్రయత్నిస్తుండగా తమకు అందిన సమాచారంతో అక్కడి తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. దీంతో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి ఎస్సైలు, సిబ్బంది గంజాయి ముఠా వున్న ప్రాంతంపై దాడులు చేసి 8 మందిని అరెస్టు చేశారని తెలిపారు. వీరిలో ఎ1గా వున్న వనపర్తి బాపిరాజు కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వాడని తెలిపారు. ఏజెన్సీలో గంజాయి విక్రేతలకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కొనుగోలుదారులకు అతడు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఈ కేసులో బాపిరాజు, (మల్లేపల్లి), కిముడు కృపానందన్ కోడ ధనుంజయరావ్, పాంగి గోవిందరావులు (విశాఖ జిల్లా), టి.రఘు, కుమారన్ కృష్ణన్ (తమిళనాడు), శంకర్, నవీన్ కుమార్ (కర్ణాటక) ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు. మరో ఇద్దరు కీలక నిందితులు తమిళనాడుకు చెందిన మురుగన్, కర్ణాటకకు చెందిన సర్వన్‌లను అరెస్టు చేయాల్సివుందని చెప్పారు. గంజాయి రవాణా విక్రయాలను అరికట్టేందేకు ఈగల్ అనే ప్రత్యేక విభాగాన్ని డీజీపీ ఏర్పాటుచేసినట్టు చెప్పారు.


తునిలో గంజాయి కేసులో అరెస్ట్ చేసిన నిందితులతో పోలీసులు

సిబ్బందికి రివార్డులు

గంజాయి కేసును ఎంతో చాకచక్యంగా ఛేదించి ముద్దాయిలను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్సై సతీష్, గండేపల్లి హెచ్‌సీ సలీం, సీఐ ఆఫీసు పీసీ కృపావరం, మరో నలుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులకు ఎస్పీ రివార్డులు అందించారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, పాల్గొన్నారు.

తునిలో ఇద్దరి అరెస్టు

తుని: స్థానిక నర్సీపట్నం బస్టాండ్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సూచనల మేరకు పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించగా అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం కాంటారం గ్రామానికి చెందిన బొడ్డు వరప్రసాద్, విజయవాడ మహంతిపురానికి చెందిన వెనిగళ్ల పద్మను అదుపులోకి తీసుకుని ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వరప్రసాద్‌పై నాతవరం, నర్సీపట్నం రూరల్, డొంకరాయి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు కేసులు ఉన్నాయన్నారు. పద్మపై విజయవాడ భవానీపురం, నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీస్‌స్టేషన్లో కేసులు ఉన్నాయని, వీరు చాలా కాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నారని, వీరికి ఉన్న పరిచయాలతో యువతను మత్తుకు అలవాటు చేస్తున్నారన్నారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. పట్టణ ఎస్సై విజయ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా కీలకం

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- సోషల్ మీడియా యాక్టివ్ సభ్యులు, పార్టీ నేతలతో ఆత్మీయ సమావేశం


వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా శ్రేణులతో ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా ఎంతో కీలకమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గ సోషల్ మీడియా యాక్టివ్ సభ్యులు, పార్టీ నాయకులతో బుధవారం గిరిబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ విస్తరిస్తోందన్నారు. సమాజంలో జరిగే ప్రతి విషయం అతి తక్కువ సమయంలో ప్రజలకు చేర్చి వారిని చైతన్య పరచడంలో సోషల్ మీడియా ప్రథమ స్థానంలో ఉందన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లు ఎంతో కృషి చేశారన్నారు. గతంలో పార్టీకి అందించిన బలం తనకూ ఇవ్వాలని కోరారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రజలకు చేసిన ప్రతి మంచి పనిని ప్రజలకు చేరవేసి ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రజలను ఉత్తేజ పరచడానికి మీరు చేసే న్యాయ పోరాటంలో మీకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ముద్రగడ పద్మనాభం మీకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిగడం వెంకటేశ్వరరావు, గొల్లపల్లి సురేష్, రామిశెట్టి నాని, సత్యనారాయణ, నరాల శ్రీను, గోళ్ల నాగేశ్వరరావు, శివ ప్రసాద్, గంట భాస్కర్, కొవ్వుల రాజశేఖర్, బంటుపల్లి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి


ఎస్.అన్నవరంలో వర్క్ ఫ్రమ్ హోం సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాయినవీన్

తుని రూరల్: వర్క్ ఫ్రమ్ హోం సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.సాయి నవీన్ సూచించారు. మండలంలోని మేజరు పంచాయతీ ఎస్.అన్నవరంలో పంచాయతీ కార్యదర్శి వీరలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం సచివాలయాల సిబ్బంది నిర్వహిస్తున్న వర్క్‌ఫ్రమ్ హోం సర్వేను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లిన సచివాలయ సిబ్బంది ఆయా గృహస్తులను ఏ విధంగా సర్వేలో భాగస్వామ్యం చేస్తున్నారో పరిశీలించారు. సర్వే లక్ష్యం, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇప్పటికే వేర్వేరు కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగులు వివరాల నమోదుతో పాటు వర్క్‌ఫ్రమ్ హోం చేసేందుకు అనువైన వాతావరణం, మౌలిక వసతులు ఉన్నాయో లేదో సమగ్రంగా నమోదు చేయాలని, ఉద్యోగి ఆసక్తి తెలుసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు ఉంటే ప్రభుత్వం ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణకు ప్రోత్సహించాలన్నారు. పంచాయతీలో ఉన్న నాలుగు సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించి, తనిఖీలు నిర్వహించారు. సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 27 సచివాలయాల పరిధిలో సర్వే ముమ్మరంగా జరుగుతుందని చెప్పారు.

అనాథ శవానికి దహన సంస్కారాలు

మానవత్వం చాటుకున్న వివేకానంద సేవాసమితి


ఏలేశ్వరంలో దహన సంస్కారాలు చేస్తున్న సమితి సభ్యులు

ఏలేశ్వరం: మండలంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న వివేకానంద సేవా సమితి బుధవారం పట్టణంలో అనాథ శవానికి దహన సంస్కారాలు చేసి మానవత్వం చాటుకుంది. కాకినాడ జిల్లా కరప మండలం సిరిపురం గ్రామానికి చెందిన కిర్లంపూడి సత్యనారాయణ(75) యర్రవరం జాతీయ రహదారిపై దీనస్థితిలో ఉండడంతో సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, ఇతర సభ్యులు కలిసి ప్రత్తిపాడు శారదా వయోవృద్ధాశ్రమంలో చేర్పించారు. సత్యనారాయణ ఆరోగ్యం క్షీణించడంతో ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆ శవానికి నాగేశ్వరరావు తనమిత్రులతో కలిసి ఏలేరు నది ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహించారు. సమితి సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వాగు రాజేష్, బుగతా శ్రీను, కానిస్టేబుల్ పాండ్రింకి రామకృష్ణ, రాతికింద సతీష్, అడపా సుబ్రమణ్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు


ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద బుధవారంఉద్యోగులు ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్ మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎస్వీరావు, బీమన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

తుని రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున వితంతువులు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.సాయి నవీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ సమయం, అంతకు ముందు పింఛన్లు తీసుకుంటున్న భర్తలు చనిపోతే సంబంధిత వితంతువులు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే ఎంపీడీఓ, ఎంసీ స్థాయిలో ఆమోదించి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పింఛన్లు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భార్య ఆధార్ కార్డు జెరాక్స్‌లు జత చేయాలని సూచించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రత్తిపాడు: గాలికుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ నెల 31వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. ఆరు నెలలు పైబడిన ప్రతీ పశువుకు టీకా వేయించాలన్నారు. నాలుగు నుంచి ఎనిమిది నెలల లోపు వయస్సు ఉన్న పెయ్యి దూడలను గుర్తించి, వాటికి విడిగా బ్రూసెల్లా వ్యాధి నివారణా టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. టీకాలు కోల్డ్‌చైన్ మెయిటైన్ చేయడంపై శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ మాట్లాడుతూ ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో పశువులకు 22,050 డోసుల టీకాలు వేయనున్నట్టు తెలిపారు. దీని కోసం ఎనిమిది బృందాలను నియమించామన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం ప్రభుత్వ పశు వైద్యశాల వైద్యాధికారి సుంకర వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 27 మంది గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. కిర్లంపూడి ప్రభుత్వ, జగపతినగరంలో ప్రగతి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. సెకండియర్ ఇంగ్లిషు పరీక్షలకు 866 మంది హాజరు కావల్సి ఉండగా 837 మంది హాజరయ్యారు. 27 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు సీఎస్‌లు పలివేల శివాజీ, జె.కాంచనమాల తెలిపారు. గెద్దనాపల్లి, తామరాడ, బూరుగుపూడి ప్రభుత్వోన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఇంటర్ తెలుగు పరీక్షలకు 732 మంది హాజరు కావల్సి ఉండగా 664 మంది విద్యార్థులు హాజరయ్యారు. 67 మంది గైర్హాజరైనట్టు కో ఆర్డినేటర్ సాయి తెలిపారు.


సర్పంచ్ శ్రావణికి అరుదైన గౌరవం

గోకవరం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పంచాయితీరాజ్ శాఖ ఢిల్లీలో మహిళా సాధికారతపై బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాపులో గోకవరం సర్పంచ్ కొమరం శ్రావణికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరఫున ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఫ్రెండ్లీ మహిళా సర్పంచ్‌గా ఆమె ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యంతో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వర్క్‌షాపులో వివరించినట్లు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, గ్రామస్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పులపర్తి బుజ్జి, సెక్రటరీ బొర్రు శిరీష పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితులకు జరిమానా

తుని రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 35 మందికి రూ.10 వేలు చొప్పున మొదట జుడీషియల్ కోర్టు న్యాయమూర్తి జరిమానా విధించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి బుధవారం తెలిపారు. 35 మందికి రూ.3.50 లక్షల జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, లైసెన్స్, హెల్మెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు లేకపోయినా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ప్రగతిలో గెస్ట్ లెక్చర్


గెస్ట్ లెక్చర్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివరామకృష్ణ

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ సెక్యూరిటీ ఇన్ ది ఎరా ఆఫ్ ఏ1 అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూకే, సీఎస్సీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.శివరామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాలు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.నరేష్, డైరెక్టర్ ఎంవీ హరనాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, అకడమిక్స్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధికారి కె.లక్ష్మి వివేక, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: మహిళల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎస్సై టి. రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలీసు స్టేషన్ విధులు, ఆధునిక పోలీసింగ్ విధానాలు, మహిళ భద్రత, నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు విధులు, నేరాల నివారణలో ప్రజా సహకారం ఎంతో అవసరమన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీ


జగ్గంపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

జగ్గంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేటలో బుధవారం మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రారంభించారు. జగ్గంపేట పోలీసు సర్కిల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

గోకవరం: స్థానిక కేవీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ పీవీవీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫాక్స్‌కాన్ మాన్యుఫేక్చరింగ్, వైఎస్‌కే ఇన్ఫోటిక్, జేఎస్ సొల్యూషన్స్ ప్రైవేట్ కంపెనీలు సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశాయన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో ఉదయం 9 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు


చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, చేయించాల్సిన వ్యాయామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ రామశేఖర్ పరిశీలించారు. ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్‌పై బహిరంగ చర్చ

తుని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల సోషల్ ఆడిట్ నివేదికను గురువారం బహిరంగంగా వెల్లడిస్తామని ఏపీఓ పి.నారాయణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు గత నెల 18 నుంచి ఈ నెల 4వ తేదీ వరకూ సీఆర్‌పీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సోషల్ ఆడిట్ జరిగిందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం పది గంటలకు అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో మండలస్థాయిలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధి కూలీలు, రైతులు, తనిఖీ బృందాలు హాజరు కావాలన్నారు. గ్రామాల్లో పరిష్కారం కాని అభ్యంతరాలు ఉంటే ఈ సమావేశంలో రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ


రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జగ్గంపేట క్రీడాకారులు

జగ్గంపేట: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గంపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి నాలుగు గోల్డ్, మూడు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ నెల 1, 2 తేదీల్లో విశాఖ పట్టణంలో జరిగిన 4వ స్టేట్ లెవల్ పవర్ లిఫ్టింగ్, 7వ స్టేట్ లెవల్ బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు. సుమారు 175 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో జగ్గంపేటకు చెందిన ఎం.అశ్విన్ సబ్ జూనియర్స్ 93 కేటగిరిలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించగా, డి.సుమిత్‌రాజు జూనియర్స్ 59 కేటగిరిలో గోల్డ్, సిల్వర్ పతకాలు, బి.శివసాయి వీరబాబు సీనియర్స్ 83 కేటగిరిలో ఒక గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఏపీ పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ ఎం.భాస్కరరావు చేతులమీదగా వీరు బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు జగ్గంపేట కోచ్ కన్నారావు తెలిపారు. రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం డైరెక్టర్ కొత్త కొండబాబు, స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

సీఆర్వో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం

అన్నవరం: రత్నగిరిపై గదుల రిజర్వేషన్ కార్యాలయ (సీఆర్వో) సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హరిహరసదన్ పక్కన గల స్థలాన్ని వివాహానికి అద్దెకి తీసుకున్న పెళ్లిబృందం పది రోజుల అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైంది. వివరాల్లోకి వెళితే.. గత నెల 22న వివాహం చేసునేందుకు ఒక పెళ్లిబృందం హరిహరసదన్ పక్కన గల స్థలం అద్దెకు తీసుకుంది. రూ.29 వేలు అద్దె చెల్లించారు. ఆ బృందం వివాహం చేసుకుని 23వ తేదీన వెళ్లిపోయారు. కంప్యూటర్‌లో ఆ స్థలం ఖాళీ అయినట్లు దేవస్థానం గదుల రిజర్వేషన్ కార్యాలయ సిబ్బంది చెకౌట్ చేయాల్సి ఉంది. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండి చెకౌట్ చేయలేదు. దీంతో గత పది రోజులగా ఆ పెళ్లిబృందం స్వాధీనంలోనే ఆ స్థలం ఉన్నట్టుగా కంప్యూటర్‌లో రోజుకు రూ.29 వేలు చొప్పున అద్దె నమోదైంది. అంటే పది రోజులకు మొత్తం రూ.2,90,000 అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైంది. కాగా పెళ్లిబృందం ఒక రోజు మాత్రమే ఆ స్థలాన్ని అద్దెకు తీసుకుని పెళ్లి చేసుకుని వెళ్లిపోయారు. అందువలన వారికి ఎటువంటి బాధ్యత ఉండదు. కంప్యూటర్‌లో నమోదైన ఈ పది రోజుల అద్దె ఎవరు చెల్లిస్తారు..? లేక సాంకేతిక లోపం పేరుతో ఆ అద్దెను రద్దు చేస్తారా అనే విషయం చర్చనీయాంశమైంది. గత నెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రత్నగిరిపై తనిఖీల్లో భాగంగా గదులు అద్దెకిచ్చే కార్యాలయాన్ని తనిఖీ చేసి గదులు ఖాళీ ఉన్నా భక్తులకు అద్దెకివ్వని పరిస్థితి గమనించి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. అయినప్పటికీ దేవస్థానం అధికారుల పర్యవేక్షణాలోపం వలన ఆ విభాగం సిబ్బంది పనితీరు ఏమాత్రం మారలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

శంఖవరం: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది పని చేయాలని సర్పంచ్ కొల్లు సత్తిబాబు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.